నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
ఆదివారం | జులై 14, 2024 | www.navatelangana.com

నాలుగు ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులు సీజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న నాలుగు ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులను శనివారం ఉదయం ఆర్టీఓ అధికారులు సీజ్ చేశారు. జిల్లా రవాణా శాఖ అధికారి శివపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏఎంవీఐ సి.హరీంద్రకుమార్, ఇతర సిబ్బంది ఉదయం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కాళేశ్వరి ట్రావెల్స్, డైమండ్ ట్రావెల్స్, సహారా ట్రావెల్స్, ముస్కాన్ లక్కీ ట్రావెల్స్‌కు చెందిన నాలుగు బస్సులను సీజ్ చేసి ఆర్టీసీ డిపోకు తరలించారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని డీటీఓ శివపల్లి శ్రీనివాస్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రాథోడ్ రమేష్ అంత్యక్రియలు అధికారికంగా నిర్వహించకపోవడం శోచనీయం

నవతెలంగాణ-నార్నూర్

రాజకీయంలో అనేక పదవులు చేపట్టి ప్రజా చేస చేసిన మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అంత్యక్రియలను అధికారికంగా నిర్వహించకపోవడం శోచనీయమని లంబాడి జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్ అన్నారు. శనివారం తాడిహత్నూర్‌లో నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. కేబీ కాంప్లెక్స్‌లో జరిగిన రైతుల అభిప్రాయ సేకరణ సదస్సుకు హాజరైన డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, ఇతర మంత్రులు కూతవేటు దూరంలో ఉన్న పూలాబీ బాబా పాఠశాలలో(తెరవి) జరిగిన రమేష్ పెద్ద కర్మకు హాజరు కాకపోవడం శోచనీయమన్నారు. గిరిజనులు, గిరిజన నాయకుల పట్ల కనీస గౌరవం ఇవ్వకపోవడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. ఆయన వెంట లంబాడి జేఏసీ జిల్లా ఉపాధ్యక్షులు నేతావత్ రాందాస్ నాయక్, ఆడే సురేష్, పవార్ దేవిదాస్, పవార్ గణేష్, భీంరావ్, రామారావ్, సంతోష్, రామ్ మహారాజ్, రాంజీ, రాథోడ్ రమేష్ ఉన్నారు.



చెట్టుకు కారు ఢీకొని బాలుడు మృతి

- ముగ్గురికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-జన్నారం

చెట్టుకు కారు ఢీకొని బాలుడు మృతి చెంది ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని టీజీ పల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. జన్నారం ఎస్ఐ గుండేటి రాజా వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ జిల్లాలోని లింగాపూర్ మండలం కొత్తపల్లి(చిక్కలగూడెం) గ్రామానికి చెందిన జాదవ్ గోపీచంద్ నార్నూర్ సిఐ గన్మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా మందమర్రిలో ఓ పుట్టినరోజు వేడుకలకు వెళ్లి తిరిగి వారి స్వగ్రామానికి వెళ్తుండగా రాత్రి 12 గంటల సమయంలో జన్నారం మండలంలోని టీజీ పెళ్లి గ్రామ సమీపాన అతని కారు ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొంది. ఆ కారులో ప్రయాణిస్తున్న తన కుమారుడు జైసన్ రాజ్(10) అక్కడికక్కడే మృతి చెందగా అతని భార్య గీత అత్త జిజియాబాయ్‌తో పాటు అతనికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది రఫిక్, జాడి రమేష్‌లు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని వారికి ప్రథమ చికిత్సఅందించారు. గాయాల పాలన ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. వారి కుటుంబ సభ్యులు జాదవ్ భీంరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్టు ఎస్ఐ తెలిపారు.



గాయపడ్డ గీత

జోరు వానలేవీ..?

- కొన్ని మండలాల్లో లోటు వర్షపాతం నమోదు
- నిండని ప్రాజెక్టులు..చెరువుల్లోకి చేరని నీరు
- ఇంకా 8మీటర్ల లోతులోనే భూగర్భజలాలు
- పరిస్థితి ఇలాగే కొనసాగితే రబీ పంటలకు కష్టం

జిల్లాలో అడపాదడప వర్షాలు కురుస్తున్నా.. అంతగా ఉపయోగం ఉండటం లేదు. పంటలకు సరిపడా వర్షం కురుస్తున్నా..భవిష్యత్తు అవసరాలకు మాత్రం సరిపడటం లేదు. వర్షాకాలం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు ఒకటి, రెండు వానలు తప్పితే..జోరుగా కురిసిన సందర్భాలు లేవు. దీంతో వేసవిలో బోసిపోయిన సాగునీటి ప్రాజెక్టులు.. చెరువుల్లోకి కొంత మేరకు కొత్త నీరు వచ్చినా..పూర్తిగా నిండే స్థాయికి రావడం లేదు. ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలో సాధారణ వర్షపాతం మాత్రమే నమోదవుతుండగా.. కొన్ని మండలాల్లో లోటు వర్షపాతాన్ని సూచిస్తుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే వరి సాగుతో పాటు రానున్న రబీ పంటలకు నీరందించడం కష్టతరంగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలో వరుసగా జోరు వానలు కురుస్తాయని వాతావరణశాఖ చెబుతున్నా ఆ స్థాయి వర్షాలు మాత్రం కనిపించకపోవడం జిల్లావాసులను నిరాశకు గురిచేస్తోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో వర్షాలు ఇంకా జోరందుకోవడం లేదు. పంటలకు అవసరమయ్యేలా అడపాదడప కురుస్తున్నా.. నీటి నిల్వకు మాత్రం ఉపయోగపడటం లేదు. వర్షాకాలం ప్రారంభమై నెలన్నర గడుస్తున్నా పూర్తిస్థాయిలో వర్షాలు కురవడం లేదు. ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలో సాధారణ వర్షపాతమే నమోదు కాగా.. ఇంకా కొన్ని మండలాల్లో లోటు వర్షపాతం సూచిస్తుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు 321.8మి.మి వర్షపాతం కురవాల్సి ఉండగా 357.3మి.మి కురిసింది. దీంతో సాధారణ కంటే కొంత ఎక్కువగానే ఉన్నా.. నేరడిగొండ మండలంలో మాత్రం లోటు వర్షపాతం కనిపిస్తోంది. మరోపక్క రెండు రోజులకు ఒకసారి కురుస్తున్న ఈ వర్షం పంటలను అనుకూలంగా మారగా.. భవిష్యత్తు అవసరాలకు నిల్వ ఉండటం లేదు. దీంతో పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోవు రోజుల్లో దుర్భిక్ష పరిస్థితులు తలెత్తుతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రాజెక్టుల్లో జలకళ ఏదీ..?

కిందటేడాది అధిక వర్షాల కారణంగా ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ ఇప్పటికే పూర్తిగా నిండిపోయాయి. వర్షాకాలం ప్రారంభం నుంచి ఎడతెరిపి లేకుండా కురవడంతో జూన్ చివరి నాటికే అనేక ప్రాజెక్టులు నిండుకుండలా కనిపించాయి. జులైలో అధిక వర్షాల కారణంగా ప్రాజెక్టుల్లోకి వచ్చిన వరద నీటిని అధికారులు కిందకు వదిలారు. దీంతో సెప్టెంబర్‌లో వర్షాలు ఆగిపోవడంతో ప్రాజెక్టుల్లో నీటి నిల్వ తగ్గిపోయింది. కిందటేడాది రబీ వంటలకు నీళ్లందించడంతో వేసవి నాటికి ప్రాజెక్టుల్లో నీరు లేకుండా పోయింది. కడెం ప్రాజెక్టు గేట్లు పనిచేయకపోవడంతో నీరంతా కిందకు వెళ్లిపోయి రబీ పంటలకు కూడా నీరందించలేని పరిస్థితి కనిపించింది. తాజాగా ఈ ఏడాది జులై రెండో వారం ప్రారంభమైనా ప్రాజెక్టుల్లోకి నీరు చేరడం లేదు. వర్షాలు అంతగా లేని కారణంగా ప్రాజెక్టుల్లోకి వరద ప్రభావం కనిపించడం లేదు. మరోపక్క గ్రామాల్లోని చెరువులు, కుంటలు సైతం నిండటం లేదు.

రబీలో కష్టమే..!

జిల్లాలో వర్షపాతం ఇలాగే కొనసాగితే రానున్న రబీలో పంటలకు నీరందించడం కష్టతరంగా మారుతోంది. ప్రతి ఏటా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 12లక్షల హెక్టార్లలో వివిధ రకాల పంటలు వండిన్నుంటారు. ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా ఉంటేనే వరితో పాటు వివిధ రకాల వంటలకు సాగునీరందించవచ్చు. కానీ ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో కీలకమైన కడెం, సాత్నాల, మత్తడివాగు, ఎల్లంపల్లి, స్వర్ణ తదితర ప్రాజెక్టుల్లోకి వరద నీరు అంతగా రావడం లేదు. దీంతో ఈ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండితేనే రానున్న యాసంగిలో పంటలకు ఉపయోగం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మరోపక్క వేసవి చివరి నాటికి జిల్లాలో 10మీటర్ల లోతుకు వెళ్లిపోయిన భూగర్భ జలాలు వర్షాకాలం ప్రారంభమైనా పెరగడం లేదు. జున్ నాటికి కేవలం 2మీటర్లు మాత్రమే పెరిగాయి. ఇంకా 8మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి.



పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకోని సాత్నాల ప్రాజెక్టు

వైద్య సిబ్బంది సేవలు అభినందనీయం



నవతెలంగాణ-నస్పూర్

ఆరోగ్య పరిరక్షణలో వైద్య సిబ్బంది సేవలు అభినందనీయమని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఉపరితల గనిని, సీఆర్ఆర్ కంపెనీ కాంట్రాక్టు ఉద్యోగులకు నిర్వహించిన వైద్య శిబిరాన్ని జీఎం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆరోగ్యంగా ఉంటేనే, ఓబీ లక్ష్యాలను సులువుగా సాధించవచ్చని, వర్షాకాలం దృష్ట్యా బొగ్గు, ఓబీ ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం లేకుండా చూసుకోవాలని ఓబీ ఎంత ఎక్కువ తీస్తే అంతా బొగ్గు ఉత్పత్తి సాధించవచ్చని అన్నారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరం సాధించవలసిన నిర్దేశిత లక్ష్యాలను సాధించడానికి ప్రతి ఒక్క అధికారి, ఉద్యోగి కృషి చేయాలని నిర్దేశిత లక్ష్యాల సాధనకు అనుగుణంగా ప్రణాళికలు వేసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గని ప్రాజెక్ట్ ఆఫీసర్ టి శ్రీనివాస్, గని ఇన్‌చార్జి మేనేజర్ ఐ శ్రీనివాస్, డీవై.సీఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు, సర్వే అధికారి సంపత్, సంక్షేమ అధికారి బి శంకర్, డాక్టర్లు పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

దళిత కుటుంబంపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బంగారిగూడలో దళిత కుటుంబంపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి జిల్లా అధ్యక్షులు అల్లూరి భూమన్న డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం డీఎస్పీ జీవన్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఈ నెల 10న బంగారిగూడలో నివాసం ఉంటున్న మోరే సూర్యకాంత్, అతని కుటుంబ సభ్యులపై కొంతమంది రౌడీ మూకలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు తెలిపారు. రూరల్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేసినా ఇంతవరకు నిందితున్ని అరెస్ట్ చేయలేదని తెలిపారు. డీఎస్పీ వెంటనే స్పందించి తక్షణమే నిందితుల్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై డీఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఐక్య పోరాట సమితి ఆధ్వర్యంలో కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ నలగంటి నవీన్, నాయకులు ఈర్ల దయాకర్, సందీప్, బాలాజీ, నాందేవ్, దేవిదాస్,పెంటపర్తి ఊశన్న, సూర్య వరప్రసాద్, సత్యనారాయణ ఉన్నారు.



డీఎస్పీతో మాట్లాడుతున్న నాయకులు



సూర్యకాంత్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దళిత నాయకులు



ఆటోల్లో తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని కామాయి ఎక్స్ రోడ్ వద్ద ఎస్ఐ పురుషోత్తం సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా మూడు ఆటోల్లో తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టుబడింది. జిల్లా కేంద్రానికి చెందిన మహమ్మద్, సాబీర్, ఫైజాన్ జావిద్, అఫ్సర్, షౌకత్ సయ్యద్, రఫిక్(బంగారిగూడ) సేకరించిన సుమారు 16.5 క్వింటాళ్ల బియ్యాన్ని తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై పురుషోత్తం మాట్లాడుతూ ఈ బియ్యాన్ని ఆదిలాబాద్‌లోని వివిధ గ్రామాలలో సేకరించి మహారాష్ట్రలోని బోరి గ్రామానికి చెందిన జావిద్ అమ్మడానికి తీసుకెళ్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. బియ్యాన్ని, వాహనాలను సీజ్ చేసి వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడిన ఉపేక్షించేది లేదని సీఐ డి.సాయినాథ్ తెలిపారు. ఎస్ఐ పురుషోత్తం, సిబ్బంది సిరాజ్, శివాజీ, లింగమూర్తిని డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అభినందించారు. గంజాయి, గుట్కా, మట్కా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై ఉక్కు పాదం మోపాలని డీఎస్పీ తెలిపారు.



రేపటి ధర్నాను విజయవంతం చేయండి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా 15వ తేదీన శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హెచ్ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ సారయ్య అన్నారు. శనివారం శ్రీరాంపూర్‌లోని ఎంపీటీసీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలోని గనులను వేలం వేసి కార్పొరేట్ శక్తులకు అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థను కాపాడుకోవడానికి హెచ్ఎంఎస్, ఐఎఫ్‌టీయూ, సింగరేణి ఉద్యోగుల సంఘం ఏఐఎఫ్‌టీయూ, టీఎస్‌టీయూసీ సంఘాలు ఐక్యవేదికగా చేపట్టిన ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను వేలం వేయడం వల్ల సింగరేణి సంస్థ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని, గత పాలకుల రాజకీయ జోక్యం వల్ల సింగరేణి సంస్థ ప్రయివేటీకరణ దిశగా ప్రమాద స్థాయికి చేరుకుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఒక ప్రక్క సింగరేణి సంస్థను ప్రయివేట్ పరం చేయబోమంటూ అసత్య ప్రచారం చేస్తూ, గనుల వేలానికి పాల్పడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి అనిల్‌రెడ్డి, ఏరియా నాయకులు చెవుల శ్రీనివాస్, ఆరెల్లి రమేష్, శివ శంకర్, కనకయ్య, సాగర్, మల్లేష్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రతిభ ఉన్న క్రీడాకారులకు పూర్తి సహకారం

- చైర్మన్‌ను కలిసిన జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో ప్రతిభ ఉన్న యువతి యువకులు ఎందరో ఉన్నారని, అలాంటి వారికి క్రీడల్లో తన పూర్తి సహకారం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా నియామకమైన ఆయన శనివారం హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డిని జిల్లా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామీణ క్రీడాకారులు ఎందరో మంది ప్రతిభ ఉన్నా ప్రోత్సాహం లేక వెనుకబడి పోతున్నారన్నారు. అలాంటి వారిని యువజన కాంగ్రెస్ నాయకులు గుర్తించాల్సిన అవసరం ఉందని సూచించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభ ఉన్న ప్రతి ఒక్కరికి క్రీడల్లో అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్‌గౌడ్, ఆదిలాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ అధ్యక్షుడు పోతారెడ్డి ఉన్నారు.



పండిత్, వ్యాయామ ఉపాధ్యాయుల కృతజ్ఞత సభ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రమోషన్స్ పొందిన భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి స్థానికంగా కృతజ్ఞత సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ అధికార ప్రతినిధి, మ్యానిఫెస్టో కమిటీ సభ్యులు, పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి హాజరయ్యారు. 25 సంవత్సరాలుగా ఎదురుచూసి ఉద్యోగోన్నతులు పొందిన పలువురు ఉపాధ్యాయులు కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఇందులో హర్షవర్ధన్‌రెడ్డి పాత్ర కీలకంగా ఉందని పేర్కొంటూ ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ ఉపాధ్యాయ పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు వివేక్ భవానీ, చిందం ఆశన్న, గిరిధర్, శంకర్, రమేష్, రామకృష్ణగౌడ్, విజయ మోహన్‌రావు, జావిద్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కొండాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగం దృష్ట్యా డీటీఆర్ ఓవర్ లోడ్, లో ఓల్టేజ్ సమస్యని అధిగమించటానికి కొండాపూర్ పరిధిలో గల 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 160 కేవీఏ డీటీఆర్‌ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని ఇస్పూర్, రాజురా గ్రామాల్లోని అమ్మఆదర్శ పాఠశాల పనులను శనివారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీలించారు. అదేవిధంగా ఇటీవల నూతనంగా నిర్మించిన లోలెవెల్ వంతెనను పరిశీలించారు. రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన పలు అంశాలపై గ్రామస్తులతో చర్చించారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ సజన్, మాజీ డీసీసీబీ డైరెక్టర్ గణేష్, పీఏసీఎస్ చైర్మెన్ నానకొసింగ్, గులాబ్‌సింగ్, ప్రతాప్‌సింగ్, గులాబ్‌సింగ్ ఉన్నారు.



బాధితురాలికి పరామర్శ

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని పాషాతండ గ్రామానికి చెందిన సుమిత్ర ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంట్లో చికిత్స పొందుతుంది. కాగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం బాధితురాలిని పరామర్శించారు. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. ఏదైనా ఇబ్బంది ఉంటే ఏ సమయంలోనైనా తనను సంప్రదించాలని, అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ సజన్, పీఏసీఎస్ చైర్మెన్ నానకొసింగ్, గులాబ్‌సింగ్, ప్రతాప్‌సింగ్ ఉన్నారు.



పిడుగు పడి 12 మేకలు మృత్యువాత



నవతెలంగాణ-తాంసి

పిడుకు పడి 12 మేకలు మృత్యువాత పడ్డ సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రాగి కిష్టుకు చెందిన పది మేకలు, పెద్దపెల్లి రాములుకు చెందిన రెండు మేకలు పిడుగు పడి మృతి చెందాయి. ఎప్పటి లాగే తమ మేకలను మేపడానికి బోడగుట్ట సమీపానికి వెళ్లారు సాయంత్రం నాలుగు గంటల సమయంలో భారీ వర్షం కురువడంతో పక్కనే ఉన్న చెట్టు కిందికి మేకల మందను నిలుచోబెట్టి వీళ్లిద్దరు మరో చెట్టు కింద నిల్చున్నారు. ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో మేకల మంద ఉన్న చెట్టుపై పడటంతో 12 మేకలు మృత్యువాత పడ్డాయి. మరికొన్ని స్వల్ప గాయాలతో బయటపడ్డాయి. ఈ మేకల విలువ దాదాపు రూ.లక్ష వరకు ఉంటుందని మేకల యజమానులు తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రిమ్స్ వైద్యుడికి జాతీయ అవార్డు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ వైద్యుడు శనివారం జాతీయ అవార్డు అందుకున్నాడు. రిమ్స్ పాథాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేట్ అయిన డాక్టర్ ఓరుగంటి అరుణ్ కుమార్, మెడికల్ ఎడ్యుకేషన్‌లో ఎక్సలెన్స్ విభాగంలో జాతీయ అవార్డు భారతదేశపు ఉత్తమ వైద్యుల అవార్డు-2024ని అందుకున్నారు. ఈ అవార్డు కోసం మొత్తం భారతదేశం అంతటా 126 నామినేషన్లు రాగా, వాటి నుంచి డా. అరుణ్ కుమార్ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లోని హిల్టన్‌లో జరిగిన ఈ అవార్డు వేడుకకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. జాతీయ వైద్యుల దినోత్సవం రోజు జైపూర్ మేయర్, రాజస్థాన్ విద్యామంత్రి నుంచి డాక్టర్ అరుణ్ కుమార్ ఈ అవార్డును అందుకున్నారు. శనివారం రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్‌ను కలిశారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ అరుణ్ కుమార్‌కి ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని, రిమ్స్ ఆదిలాబాద్‌కు ఇది గొప్ప గుర్తింపు ఘనత అని పేర్కొన్నారు. అవార్డు రావడం పట్ల తోటి వైద్యులు ఆయనకు అభినందనలు తెలిపారు.

వాహనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలి

- ఎస్సై శ్రీకాంత్



నవతెలంగాణ-సారంగాపూర్

వాహనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. శనివారం మండలంలోని చించోలి(బి) ఎక్స్ రోడ్డు వద్ద సాయంత్రం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్ లేని, సరైన పత్రాలు లేని 14 ద్విచక్ర వాహనాలలు సీజ్ చేసినట్టు ఎస్సై తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు

మహిళ ఆత్మహత్యాయత్నం

- కాపాడిన బ్లూకోర్ట్ సిబ్బంది



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలో మనస్థాపం చెందిన ఓ మహిళ శనివారం బంగాల్‌పేట్‌లోని చెరువులో ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించగా, సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడి సమీపంలో ఉన్న బ్లూ కోర్ట్ సిబ్బందిని పంపించారు. కాగా వారు ఆమెను రక్షించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్ర బీదర్‌కి చెందిన వివాహిత ఒక సంవత్సరం కింద ఆమె భర్త చనిపోయాడు. ఆమెకి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా జిల్లాలోని ఖానాపూర్‌లో నివసించే వెంకటేష్ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం బంగాల్‌పేట్ మహాలక్ష్మివాడలో ఉంటున్నారు. కుటుంబ కలహాల వల్ల ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి బంగాల్‌పేట్ చెరువుకి వెళ్లింది. సమాచారం అందుకున్న బ్లూ కోర్టు సిబ్బంది కాపాడారు. నిర్మల్ పట్టణ పోలీసులు వాళ్ల కుటుంబ సభ్యులని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి ఆ మహిళని వారికి అప్పగించారు. ఈ సందర్భంగా నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, నిర్మల్ పట్టణ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్ కుమార్‌ని, బ్లూ కోర్ట్ సిబ్బందిని అభినందించారు.

హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్
- విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హాస్టళ్లలో వార్డెన్‌లు ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారని, సమయపాలన పాటించని హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండు రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ విద్యాసంస్థలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించటం జరిగిందని తెలిపారు. సంక్షేమ హాస్టల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి, అక్కడే అన్నవిధంగా ఉన్నాయన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం కింద ఒక్క విద్యార్థికి రూ.పదితో ఒక్క పూట భోజనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోందని, కానీ ఒక టీ కూడా రాని డబ్బులతో ఒక పూట భోజనం ఎలా సాధ్యమవుతుందని అన్నారు. అవి కూడా గత 6 నెలల నుంచి బిల్లులు విడుదల కాక విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందటం లేదన్నారు. మన ఊరు మన బడి పేరుతో ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి చేస్తామని గత ప్రభుత్వం పనులు ప్రారంభించిందని కానీ పూర్తిస్థాయిలో నిధులు మంజూరు కాలేదన్నారు. పూర్తి స్థాయిలో పనిచేయక మధ్యలో ఆపి వేయటంతో చాలా పాఠశాలల్లో మరుగుదొడ్లు, డైనింగ్ హాల్స్ నిర్మాణం మధ్యలో ఆపివేయటం జరిగిందన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.8423.56 కోట్ల స్కాలర్ షిప్స్, రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో స్కాలర్ షిప్స్ రియాంబర్స్‌మెంట్ మీద చదువుకునే విద్యార్థులు, విద్యను మధ్యలోనే ఆపివేసే పరిస్థితి నెలకొందన్నారు. ప్రజా ప్రభుత్వమని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు విద్యారంగంలో సమస్యలు పరిష్కరించకుండా నిరక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. వెంటనే విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, అభినందన్, శుభం, పవన్, మహేందర్, అక్షిత్, గోపాల్, నగేష్, చరణ్ పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-నిర్మల్

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం అభినందన సభను టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యదర్శి ఏ.వెంకట్ హజరయ్యారు. ముందుగా పదోన్నతి పొందినవారి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం విద్య పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేయకుండా దాటవేత ధోరణి ప్రదర్శించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యా వ్యవస్థను బాగు చేయాలన్న ఆలోచనతో ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేసి విద్యావ్యవస్థను గాడిలో పెట్టడం జరిగిందని అన్నారు.. కొన్ని సంఘాలు ప్రమోషన్ బదిలీలలో వెబ్ ఆప్షన్ పద్ధతిని వ్యతిరేకించినప్పటికీ, టీఎస్‌యూటీఎఫ్‌గా ఆ పద్ధతిని స్వాగతించిందని తెలిపారు. వెబ్ అప్షన్‌లో కొంత ఇబ్బంది పడినప్పటికీ కొద్దిమంది కొరకు ఈ రాష్ట్ర ప్రభుత్వం గ్రీవెన్స్ రూపంలో అప్పీల్ చేసుకోమని చెప్పడం జరిగిందని వెల్లడించారు. నిజంగా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయడం కోసం టీఎస్‌యూటీఎఫ్ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్, జిల్లా నాయకులు మూడారపు పరమేశ్వర్, మనోహర్‌రెడ్డి, చల్ల గోవర్ధన్‌రావు, రవి కిరణ్ కుమార్, బక్కన్న, అమృతరావు, పోశెట్టి, పైడిపల్లి భోజన్న, బిక్క రమేష్, సొనా గంగాధర్, లింగన్న రాజేశ్వర్, రాజేందర్, వినోద్ కుమార్, ధాన్‌సింగ్ పాల్గొన్నారు.



కాంగ్రెస్ ప్రజలను తప్పదోవ పట్టిస్తోంది

- మాజీ మంత్రి జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పదోవ పట్టిస్తోందని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలు చేసినటువంటి సంక్షేమ పథకాలనే ఇవ్వలేని, దయనీయ పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని అన్నారు. ఎలాంటి ఆంక్షలు లేవని చెప్పి ప్రజాభిప్రాయాన్ని సేకరించి అందులో కాంగ్రెస్ కార్యకర్తల అభిప్రయాలను మాత్రమే సేకరించి, నిర్ణయం తీసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేవలం కాంగ్రెస్ పార్టీ నాయకులకే పథకాలు అందించే విధంగా చూస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతుందని 6 గ్యారంటీలు ఇప్పటివరకు భర్తీ చేయకపోవడం వారి అసమర్ధతకు నిదర్శనం అన్నారు. రైతు భరోసా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ రూ.15 వేలు అందించాలని డిమాండ్ చేశారు. కేవలం సీఎం పదవీ ఊడుతోందన్న భయంతో రేవంత్‌రెడ్డి ప్రజా సేకరణ అభిప్రాయాలు అంటూ కాలయాపన చేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి సహాయం అందక రైతు ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని వీటిపై కనీసం చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించడం జరుగుతుందన్నారు. మరోవైపు గ్రూప్-2కి సంబంధించిన సబ్జెక్టు మార్చినప్పటికి వారికి సమయం తక్కువ ఇచ్చి పరీక్ష పెట్టడం పైన యువత వాయిదా వేయాలని ఉద్యమిస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకుండా ఉండటం సరికాదన్నారు. గ్రూప్-2, డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లద్, కుమ్ర రాజు, మాజీ ఎంపీపీ సేవ్వ జగదీష్, గండ్రత్ రమేష్, రాజన్న, వేణు గోపాల్ యాదవ్, విజ్జగిరి నారాయణ, సాజిదోద్దీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరో రోజుకు చేరుకున్న అంగన్‌వాడీల దీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్‌వాడీ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలేదీక్షలు శనివారంతో ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు దోనిపెల్లి వెంకటమ్మ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం టీచర్స్‌కు రూ.2లక్షలు, హెల్పర్స్‌కు రూ. లక్ష చెల్లించాలనే డిమాండ్‌తో దీక్షలు కొనసాగుతున్నాయని అన్నారు. గతంలో 24 రోజులు సమ్మె చేపట్టామని అన్నారు. సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, హామీల్లో ఒకటైన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ గురించి, వివరంగా ప్రభుత్వం ఐసీడీఎస్ మంత్రి ఐసీడీఎస్ రాష్ట్ర అధికారుల దృష్టికి అనేకసార్లు తీసుకువచ్చామన్నారు. అయినా అంశాలను పరిగణలోకి తీసుకోక పోవడం అన్యాయమన్నారు. పైగా రాష్ట్రంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ మనోభావాలకు వ్యతిరేకంగా, ఏకపక్షంగా అతి తక్కువ డబ్బులు చెల్లించి, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌ను జులై 4 తర్వాత ఇంటికి పంపించాలని నిర్ణయం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు తీవ్రమైన నష్టం కలిగించే ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని అన్నారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు నష్టం కలిగించే జీఓ నెం.10ని రద్దు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్స్‌కు రూ.2లక్షలు, హెల్పర్స్‌కు రూ.లక్ష పెంచుతూ కొత్త జీఓను జారీ చేయాలని, వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు సునిత, అంగన్‌వాడీలు ఉన్నారు.



అప్రకటిత కరెంటు కోతలపై రైతు ఆగ్రహం

- మొలకెత్తిన విత్తనాలను రోడ్డుపై పోసి నిరసన



నవతెలంగాణ-ఖానాపూర్

అప్రకటిత కరెంటు కోతలకు నిరసనగా ఆగ్రహించిన రైతన్న మొలకెత్తిన వరి ధాన్యాన్ని రోడ్డుపై పోసి నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టాడు. ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి చెందిన రైతు రమేష్ ఉదయం తన పంట పొలాలకు వెళ్లి పొలానికి సాగునీరు అందించేందుకు మొలకెత్తిన వరి విత్తనాలను తీసుకెళ్లాడు. మోటారు వేసి పొలానికి సాగునీరు అందించి విత్తనాలను చల్లుదామని మోటార్ వేయగా సాగునీరు రాలేదు. దీంతో కరెంటు లేదని తెలుసుకున్న రైతు రమేష్ విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేసి కరెంట్ ఎప్పుడు వస్తుందని అడిగాడు. తనకు అధికారుల వద్ద నుంచి సరైన జవాబు రాకపోవడంతో తీవ్ర అసహనానికి గురయ్యాడు. మూడు గంటల వరకు కరెంటు రాకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రైతు రమేష్ మొలకెత్తిన ధాన్యాన్ని సూర్జాపూర్ ఎన్టీఆర్ చౌరస్తాలో ప్రధాన రహదారిపై పారపోసి ఆందోళనకు దిగాడు. దీంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోవడంతో సమాచార అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి రైతుని సముదాయించి ఆందోళన విరమింపజేశారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-కడెం

పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పెద్ద బెల్లాల్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దబెల్లాల్ గ్రామానికి చెందిన తుప్ప నరేష్(36) గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో భాదపడుతూ ఉన్నాడు. ఆస్పత్రిల్లో వైద్యం చేయించుకున్నప్పటికీ మెరుగవకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని పురుగులమందు తాగాడు. గమనించిన స్థానికులు నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కడెం ఎస్సై ఎం.కృష్ణ సాగర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉంది.

పర్యావరణానికి మొక్కలే జీవనాధారం

నవతెలంగాణ-నార్నూర్

పర్యావరణానికి మొక్కలే జీవనాధారమని ఎన్ఆర్ఈజీఎస్ జిల్లా అధికారి వీణ అన్నారు. శనివారం మండలంలోని తాడిహత్నూర్, గంగాపూర్ తదితర గ్రామాల్లో వన మహోత్సవంలో భాగంగా అధికారులు, కూలీలతో కలిసి మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటీ వాటిని రక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జవహర్ లాల్, ఏపీఓ జాదవ్ సురేష్, టీఏ సచిన్, ఫీల్డ్ అసిస్టెంట్ రాథోడ్ మోతీరాం, కార్యదర్శులు రాజశేఖర్, ముండే రమేష్ ఉన్నారు.

రోడ్డు నియమాలు పాటించాలి



నవతెలంగాణ-దస్తురాబాద్

ప్రజలు రోడ్డు నియమావళి పాటించాలని హెడ్ కానిస్టేబుల్ దైవాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వాహన ధృవపత్రాలు కలిగి ఉండాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని అన్నారు. ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలని, రోడ్డు నిబంధనలు పాటించాలని, ముఖ్యంగా చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. ఇచ్చినట్లయితే వాహన యజమానులపై కేసు నమోదవుతుందన్నారు. ఈ తనిఖీల్లో ఊశన్న, షఫీ, లక్ష్మణ్ నాయక్, రామగిరి వెంకటేష్, రవి ఉన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, ఈనెల 15న కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్నట్టు జిల్లా పెన్షనర్ సంఘం జిల్లా అధ్యక్షులు శశికాంత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెన్షనర్లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ విస్మరించిందని తెలిపారు. నగదు రహిత వైద్యాన్ని అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో కల్పించాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, వెల్‌నెస్ సెంటర్‌లో సరైన మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ సమస్యలు అన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న నిరసన పెన్షనర్లు అందరూ పాల్గొనాలని తెలియజేశారు.

నేడు అడెల్లి ఆలయంలో భాగవత ప్రవచనాలు

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ప్రసిద్ధి గాంచిన అడెల్లి శ్రీ మహా పోచమ్మ అయలంలో ఆదివారం సాయత్రం పరమ పూజ్య శ్రీ బాల బ్రహ్మానంద సరస్వతీవారిచే శ్రీ దేవి భాగవతం ప్రవచనములు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

3

కుమురంభీం ఆసిఫాబాద్

ఆదివారం | జులై 14, 2024 | www.navatelangana.com

ఎస్పీని కలిసిన బెల్లంపల్లి ఏరియా జీఎం

నవతెలంగాణ-రెబ్బెన



ఆసిఫాబాద్ ఎస్పీగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన డీవీ.శ్రీనివాస రావును బెల్లంపల్లి ఏరియా సింగరేణి జీఎం డి.రవిప్రసాద్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ కార్యాలయాని చేరుకొని మొక్కను బహూకరించారు. బెల్లంపల్లి ఏరియా ఉత్పత్తి, పరిసర ప్రాంతాల అభివృద్ధికి పోలీస్, సింగరేణి కలిసి పనిచేయాల్సిన ఆవశ్యకతపై చర్చించారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ సెక్యూరిటీ అధికారి ఎస్‌జీఎస్‌వీ వరప్రసాద్ పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై రాజేశ్వర్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్‌లో సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన అన్ని అనుమతి పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. వాహనాలకు పెండింగ్ చలాన్లు లేకుండా చూసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం సిబ్బంది కేటాయించినట్లు తెలిపారు. దాదాపు 30 మందికి పైగా వాహనదారులకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ దత్తు, కానిస్టేబుల్ సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారులతో అభివృద్ధి సాధ్యమేనా..?

- అదనపు విధులతో కొత్త తలనొప్పులు
- జిల్లా అధికారులకు మండల పాలన అప్పగింత
- మాతృ శాఖకు న్యాయం చేయలేకపోతున్నమంటు ఆవేదన



జడ్పీ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్డీఓ(ఫైల్)

నవతెలంగాణ -ఆసిఫాబాద్

గ్రామాలు పట్టణాలకు పట్టుకొమ్మలని మహాత్ముడు చెప్పిన నినాదంలో గ్రామాలు అభివృద్ధి చెందితేనే పట్టణాలు అభివృద్ధి చెందుతాయని అర్థం వస్తుంది. దీనికోసం గ్రామ పరిపాలనలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో ఉంటుంది. రెండు నెలల క్రితం గ్రామ పంచాయతీ సర్పంచుల పదవీకాలం పూర్తి కాగా జులై 5న ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీ కాలం పూర్తయింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడంతో నవంబర్ వరకు ఎన్నికలు జరిగే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లు ఉత్తర్వులు వెలువరించారు. ఇప్పటికే శాఖల్లో తగిన సిబ్బంది లేక ఆయా శాఖల జిల్లా అధికారులు ఇబ్బందులు పడుతున్నా నేపథ్యంలో మండలాల ప్రత్యేక అధికారులుగా అదనపు బాధ్యతలు కట్టబెట్టడంతో అభివృద్ధి సాధ్యమవుతుందా..? అనేది అనుమానం కలిగిస్తుంది. అంతే కాకుండా ఇతర శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగించడంతో వారు అటూ మాతృశాఖ ఇటూ అదనపు బాధ్యతలను పూర్తి స్థాయిలో అందించలేక సతమతవుతున్నారు. దీని కారణంగా వారిపై పని ఒత్తిడి పెరుగుతుంది. అసలే పాలనపై అవగాహన లేని అధికారులను కూడా ప్రత్యేక అధికారులకు నియమించినట్లు తెలుస్తుంది. అసలే వర్ష కాలం వ్యాధులు ప్రబలే కాలం, పూర్తి స్థాయిలో అధికారులు అందుబాటులో ఉండి వ్యాధులను నిరోదించడంతో పాటు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ఇలాంటి సవాళ్ల మధ్య ప్రత్యేక పాలన ఎలా సాగుతుందో చూడాలి.

ప్రత్యేక అధికారులతో అభివృద్ధి సాధ్యమా...?

జిల్లాలో 15 మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ప్రజా ప్రతినిధులు ప్రజలకు సమాధానం చెప్పాల్సి వస్తుందని భయంతో కొంత అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి ప్రయత్నం చేస్తారు. అలాగే వారు సొంత నిర్ణయాలు తీసుకొని అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తారు. కానీ అధికారులు కొన్ని నిబంధనలకు లోబడి ఉన్నతాధికారుల ఆదేశాలతో పనిచేయాల్సి ఉంటుంది. దీంతో ప్రస్తుతం నియమించిన ప్రత్యేక అధికారులతో అభివృద్ధి సాధ్యమవుతుందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది.

అదనపు విధులతో కొత్త తలనొప్పి

ఇప్పటికే శాఖల్లో సరిపడినంత సిబ్బంది లేకపోవడంతో ఆయా శాఖల జిల్లా అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని గత నెలలో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో రహదారులు భవనాల శాఖ అధికారితో పాటు పలు శాఖల అధికారులు ఇదే విషయాన్ని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇలా అయితే పని చేయలేమంటూ ఆవేదన వెళ్లగక్కారు. తాజాగా మండలాల ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు అప్పగించడంతో కొత్త తలనొప్పి ప్రారంభమైందంటూ పలువురు అధికారులు వాపోతున్నారు.

జిల్లా అధికారులకు మండలాల పాలన అప్పగింత

స్థానిక సంస్థలైన జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీ కాలం పూర్తి కావడం, రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు కూడా ఇప్పట్లో నిర్వహించడానికి సిద్ధంగా లేకపోవడంతో కమిషనర్ సందీప్ కుమార్ సుల్తానియా ఆదేశాల మేరకు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమిస్తూ గతవారం ఉత్తర్వులు విడుదల చేశారు. జిల్లా పరిషత్‌కు కలెక్టర్ ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తుండగా, పెద్ద మండలాలైన ఆసిఫాబాద్‌కు ఆర్డీఓ లోకేశ్వరరావు, కాగజ్‌నగర్‌కు అక్కడి ఆర్డీఓ సురేష్‌ను ప్రత్యేక అధికారిగా నియమించగా మండలాల వారీగా జైనూర్‌కు గుణవంతురావ్ (ఇరిగేషన్ ఈఈ), సిర్పూర్(యు)కు భాస్కర్(డీడబ్ల్యూఓ), లింగాపూర్‌కు సురేష్ కుమార్ (జిల్లా వెటర్నరీ అధికారి), తిర్యాణికి రమాదేవి (జిల్లా గిరిజన అధికారిని), రెబ్బెన బిక్షపతి(డీపీఓ), కెరమెరికి లక్ష్మీనారాయణ (డిప్యూటీ సీఈఓ), వాంకిడికి వెంకటపతి (భగీరథ ఈఈ), సిర్పూర్ (టి)కి, కౌటాలకు సురేందర్ (డీఆర్‌డీఓ), చింతలమానపల్లి శ్రీనివాసరావు (డీఏఓ), బెజ్జూర్‌కు వెంకటేశం (ఉద్యానవన శాఖ అధికారి), పెంచికలపేటకు ప్రభాకర్ (ఇరిగేషన్ ఈఈ), దహెగాంకు పెద్దన్న (రహదారులు భవనాల శాఖ ఈఈ)లను నియమిస్తూ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఉత్తర్వులు జారీ చేశారు.

నిధులు లేక కొట్టుమిట్టాడుతున్న జీపీలు

పంచాయతీలు నిధుల కొరతతో కొట్టుమిట్లాడుతున్నాయి. చిన్న పంచాయతీల ఆర్థిమ పరిస్థితి మరింత అధ్వానంగా తయారవుతోంది. కొన్ని గ్రామాల్లో చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించే ట్రాక్టర్‌లో డిజిల్ పోయడానికి కూడా డబ్బులు లేవని తెలుస్తోంది. పంచాయతీల భవనాలు, బోరు మోటర్లు తదిలర బిల్లులు చెల్లించడానికి నిధులు లేవని కార్యదర్శులు ఆవేధన వ్యక్త చేస్తున్నారు. వర్షకాలంలో గ్రామీణ ప్రాంతాల్లో ముందస్తుగా చేపట్టాల్సిన పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.



ప్రత్యేక అధికారులతో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే సమావేశం(ఫైల్)

ఎస్పీఎంలో ప్రమాదం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లు మూడవ నెంబర్ ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన ఆనంద్ శ్రీవాత్సవ్ కుడి చేతికి గాయాలయ్యాయి. తోటి కార్మికులు గమనించి చికిత్స నిమిత్తం స్థానిక ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం శ్రీవాత్సవ్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

విధి నిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విధి నిర్వహణలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, శాంతిభద్రతల పరిరక్షణలో సివిల్, ఏఆర్ పోలీసులు రెండు కళ్ళలాంటివారని జిల్లా ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో రిజర్వు పోలీసులతో దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఘర్షణ వాతావరణ నివారణకు పండగల్లో బందోబస్తు లాంటి అంశాల్లో రిజర్వు పోలీసుల కృషి ఎంతో ఉందన్నారు. బదిలీలు, ఉద్యోగోన్నతులలో సిబ్బంది పనితీరుతో పాటు ప్రత్యేక అవసరాలు గల వారిని దృష్టిలో ఉంచుకోవడం జరుగుతుందన్నారు. పోలీసులంటే ఒక ఉద్యోగం కాదని అది ఒక సామాజిక బాధ్యత అన్నారు. జిల్లాలో మావోయిస్టుల అణిచివేతలో ప్రత్యేక పార్టీ పోలీసుల పాత్ర వెలకట్టలేనిదన్నారు. సమాజంలో శాంతిభద్రతల సమస్య తలెత్తినప్పుడు ప్రజలు పోలీసుల వైపు చూస్తారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేయాలన్నారు. పోలీసుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని, వారికి ఏ అవసరమున్న నేరుగా సంప్రదించవచ్చని సూచించారు. ఇదే సందర్భంలో విధుల పట్ల నిర్లక్ష్య వైఖరి వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ రాణా ప్రతాప్, ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, ఆర్ఐ ఎంటీఓ అంజన్న, ఆర్ఐ హోంగార్డ్ ఇన్‌చార్జీ భరత్ భూషణ్, ఆర్ఎస్ఐలు, ఎఆర్ ఎస్ఐలు, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులు ఎం.విజయ శంకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు తరలింపు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



పట్టణంలోని కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధర్వంలో కిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో శనివారం నిర్వహించిన ఉచిత కంటి శిబిరంలో 11 మందిని ఉచితంగా కంటి ఆపరేషన్ల కోసం బెల్లంపల్లిలోని లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి అనిత, శ్రీనివాస్ బాధితులకు భోజనం సదుపాయం, ప్రయాణ చార్జీలు సమకూర్చారు. ఎలాంటి అవసరమున్నా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది గోపి పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ అధికారులు దాడి చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. టాస్క్ ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బూరుగూడ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో గ్రామానికి చెందిన ఐదు మంది పేకాటరాయుళ్ళను అదుపులోకి తీసుకొని, మూడు మొబైల్ ఫోన్లు, రూ. 13800 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదుపులోకి తీసుకున్న వారిలో సంగాడే బాలు, సత్రవేణి మల్లయ్య, భీమనపల్లి సత్తయ్య, పూదారి సత్యనారాయణ, ఇవ్వాలే రవీందర్ ఉన్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు దాడి చేసినట్లు వివరించారు. యువత ఆన్ లైన్ జూదం, క్రికెట్ బెట్టింగ్ లు ఆడుతూ అత్యాశకు పోయి జీవితాలు పాడుచేసుకోవద్దని, ఆర్థికంగా నష్ట పోతారన్నారు. కేసులు నమోదైతే ఉద్యోగ అవకాశాలు, ఇతర అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. పేకాట, ఆన్‌లైన్ మట్కా, జూదం, ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు జరిగినట్టు తెలిస్తే సమాచారం ఇవ్వాలని పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. దాడుల్లో ఎస్ఐ గంగన్న, కానిస్టేబుల్ సంజీవ్ పాల్గొన్నారు.

నేడు గోలేటిలో కృతజ్ఞత సభ

నవతెలంగాణ-రెబ్బెన

ఎంపీగా గోడం నగేష్ గెలవడంతో ఆదివారం గోలేటిలో ప్రజ కృతజ్ఞత సభను నిర్వహించడం జరుగుతుందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి జగన్నాథ ఓడెలు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారత దేశ అభివృద్ధి కోసం ప్రధానిగా నరేంద్ర మోడీని మూడవసారి, ఆదిలాబాద్ ఎంపీగా గోడం నగేష్‌ను గెలిపిచిందనకు రెబ్బెన మండలంతో పాటు గోలేటి గ్రామ ప్రజలకి కృతజ్ఞతలు తెలుపుతూ ఆదివారం సాయంత్రం 4 గంటలకు గోలేటి బస్టాండ్ ఆవరణలో కృతజ్ఞత సభ ఉంటుందన్నారు. మండలంలోని ప్రజలు, యువత, కుల సంఘాలు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అడ ప్రాజెక్టు పూర్తి చేయాలి : ఆర్ఎస్‌పీ



బెంగాలీ క్యాంప్ వద్ద చెరువును పరిశీలిస్తున్న ఆర్ఎస్‌పీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఎన్నో ఏండ్లుగా అసంపూర్తిగా ఉన్న అడ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రభుత్వం తక్షణమే రూ.20 కోట్లు మంజూరు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఈజ్‌గాం మార్కెట్, బెంగాలీ క్యాంప్ నెం. 3, 4, 5, 9,10లో పార్టీ శ్రేణులతో కలిసి క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా చెరువులను పరిశీలించారు. ప్రభుత్వం సాగునీటి వనరులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. చెరువులు, కాలువలు పూడుకుపోయి, తూము ద్వారం గేట్లు మరమ్మతులకు గురైనా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అడ ప్రాజెక్టు కాలువలు తవ్వి ఏడేండ్లు అయిన రైతులకు సాగునీరు అందడంలేదన్నారు. కాలువల తవ్వకంతో కాంట్రాక్టుల జేబులు నిండాయి తప్ప, రైతుల పొలాలకు చుక్క సాగునీరు అందడంలేదని విమర్శించారు. బెంగాలీ క్యాంప్ నెం.10 లోని అప్పర్ డ్యాం, క్యాంప్ నెం.4లోని లోయర్ డ్యాంతో పాటు స్థానిక చెరువుల గ్రోయిన్ గేట్లు మరమ్మతులకు గురై ఏండ్లు గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ కాలువలకు మరమ్మతులు చేస్తే బెంగాలీ క్యాంపు పరిధిలో సుమారు 3 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని రూ.20 కోట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో స్థానిక రైతులతో కలిసి త్వరలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లెండుగురే శ్యామ్‌రావు, ఆవుల రాజ్‌కుమార్, కొండ రాంప్రసాద్, మిథున్ బిశ్వాస్, నిత్యానంద మహంతు, కాశిపాక రాజు, రాంటెంకి నవీన్, గోపి, విశ్వనాథ మండల్, సుజిత్ దాస్, నిరంజన్, షోలెన్, ఇంద్రజిత్, దిలాజ్ బిశ్వాస్ పాల్గొన్నారు.

డోర్లీ ఓసీ గనిని సందర్శించిన ప్రొఫెసర్ సుదీప్తా



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలో మూత పడిన డోర్లీ ఓసీ 2 గనిని వెస్ట్ బెంగాల్ శిబ్‌పూర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ సుదీప్తా ముఖోపాధ్యాయ శనివారం సందర్శించారు. మూతపడ్డ గని, పరిసర ప్రాంతాల్లో చేపట్టిన పర్యావరణ, ప్రజాహిత పనులు, కట్టడాలను పరిశీలించారు. నాటిన మొక్కలు, ఎదిగిన వృక్షాలను చూశారు. పరిసర ప్రాంతాల్లో చేపడుతున్న నీటి నిర్వహణ, మృత్తిక సంరక్షణ చర్యలు వాటి వివరాలను తెలుసుకున్నారు. అంతకు ముందు జీఎం రవిప్రసాద్ ప్రొఫెసర్‌కు ఆయన కార్యాలయంలో ఏరియా వివరాలను తెలియజేవారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి ఎస్.ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి చంద్రశేకర్, కార్పోరేట్ అదనపు మేనేజర్లు వి.తిరుపతి, ఎం.రవీంద్రనాథ్, డోర్లి ఓసీ2 మేనేజర్ మహేష్, ఎన్విరాన్మెంట్ అధికారి ఎం.రమేష్, ఫారెస్ట్ అధికారి నవీన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పీరీల సందడి

నవతెలంగాణ - చింతలమానేపల్లి

త్యాగం..శాంతికి ప్రతీకగా నిర్వహించే మొహరం పండగ సందడి నెలకొంది. కర్బలా మైదానంలో జరిగిన యుద్ధంలో మృతి చెందిన వారి జ్ఞాపకార్థం శోక (సంతాప) దినాలుగా గ్రామాల్లో కులమతాలకు అతీతంగా జరుపుకుంటారు. ముస్లిములే కాకుండా ముస్లిమేతరులూ సమభావం, సామరస్యంతో కార్యక్రమాల్లో పాలు పంచుకుంటారు. మొహరం మాసం ఆరంభం నుంచి ఇస్లాం నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. ఇమామ్ హుస్సేన్ వీరమరణానికి నిదర్శనంగా చావిడి(మఖానం)లో పీరీలను కూర్చోబెట్టి పది రోజులపాటు ప్రార్థనలు చేస్తారు. కుల, మతాలకతీతంగా అందరూ పాల్గొని పీరీల వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. మత సామరస్యతకు ఇది గొప్ప నిదర్శనంగా చెప్పొచ్చు. 10వ రోజు తెల్లవారుజామున పీరీలు అగ్నిగుండంలోకి ప్రవేశించి ఊరంతా ఉత్సవం జరుపుకుంటారు. డప్పు చప్పుళ్లతో ఇంటికి వచ్చిన పీరీలకు పూలు, కాగితాలతో అందంగా తయారు చేసిన బాసింగాలు, రంగుల దట్టీలు, వెండి, బంగారు గొడుగులు, తొట్టెలు ఇచ్చి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుంటారు. ఇళ్ల నుంచి పానకం, వడపప్పు, చక్కెర, బెల్లం, ఎండు కొబ్బరిని మఖానం వరకు సపరివారంగా తీసుకొచ్చి సమర్పిస్తారు. వీటిని స్వీకరించిన చావిడి(పూజారి) ముతవలి పీరీలను ఎత్తుకున్న వారికి భక్తితో సమర్పిస్తారు. మొహర్రం అనంతరం మూడు రోజుల వరకు జియారత్ నిర్వహిస్తారు.



మండల కేంద్రంలో నిలిచిన పీరీలు

17న మొహరం..బీబీకా ఆలం

17న మధ్యాహ్నం నుంచి పీరీలను మరోసారి గ్రామంలో ఊరేగిస్తారు. పీరీలు ఏటికి పోతుంటే భక్తులంతా బెల్లం, నువ్వులు కలిపిన గట్టాలను చల్లుతుంటారు. గ్రామ శివారులోని పొలిమేర వరకు తీసుకెళ్లాక అక్కడ పీరీలను శుభ్రం చేసి ఓ మూట కడుతారు. 'అల్విదాయో ఏకుసేని' అంటూ బీబీకా ఆలం పాటను ఆలపిస్తూ పీరీలతో పాటు వాటికి అమర్చిన కర్రలు, దట్టీలను మఖానం వరకు తీసుకొస్తూ రోదిస్తుంటారు.

త్యాగ స్మృతులకు నిదర్శనం

షేక్ బాబు, చింతలమానేపల్లి



ఇమామ్ హుస్సేన్ మానవత్వానికి జీవం. ఇరాక్ రాజు యాజీద్ అన్యాయాన్ని ఎదుర్కోవడంలో వీరమరణం పొందారు. ఆయన త్యాగాలను స్మరించుకుంటూ, ధర్మపరిపాలనను మెచ్చుకుంటూ ఏటా మొహర్రం మాసంలో వచ్చే ఈ శోకదినాలను జరుపుకుంటాం. అన్ని మతాల వారు పీరీల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటూ సామరస్యతకు ప్రతీకగా నిలుస్తున్నారు.

ఉత్తమ సామాజిక సేవ అవార్డు అందుకున్న మహేష్‌గౌడ్

నవతెలంగాణ-రెబ్బెన



ఉత్తమ సామాజిక సేవ అవార్డును మండలానికి చెందిన మహేష్ గౌడ్ అందుకున్నారు. శనివారం జాతీయ మానవహక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో జరిగిన 8వ వార్షికోత్సవంలో కరోనా సమయం నుండి నేటి వరకు సేవలందించినందులకు ఉత్తమ సామాజిక సేవ అవార్డును మండలానికి చెందిన రంగు మహేష్ గౌడ్ ఇచ్చారు. ఈ అవార్డును మానవ హక్కుల సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్‌కే జైన్, హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ అందించారు. భవిష్యత్తులో కూడా ఇలానే సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలని పలువురు సూచించారు.

మాజీ ఏఎంసీ చైర్మెన్‌కు పరామర్శ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మార్కెట్ మార్కెట్ కమిటీ చైర్మెన్ గంధం శ్రీనివాస్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని తన వంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు బీజేపీ సీనియర్ నాయకులు శ్రీకాంత్, ప్రసాద్ గౌడు, అశోక్, విలాస్ ఉన్నారు.



సేవాలాల్ జయంతి వాల్ పోస్టర్ విడుదల



నవతెలంగాణ -ఆసిఫాబాద్

ఈనెల 21న నిర్వహించనున్న సంత్ సేవాలాల్ మహారాజ్ 89వ జయంతి వేడుకలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ శ్యాం నాయక్ హైదరాబాద్‌లో పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాలాల్ జయంతి సందర్భంగా ప్రతి లంబాడి తండాలో మూడు వేప చెట్లు నాటి త్యాగనిరతిని చాటాలన్నారు. సేవాలాల్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు

ఎస్పీఎంలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కోఆర్డినేటర్ గోలెం వెంకటేశం డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ ఎస్పీఎం పున:ప్రారంభం తర్వాత మిల్లులో పనిచేసిన పర్మనెంట్ కాంట్రాక్టు కార్మికులను పూర్తిస్థాయిలో విధుల్లోకి తీసుకోక పోగా స్థానికేతరులైన కార్మికులను అధిక మొత్తంలో కాగజ్‌నగర్ తరలించి ఎస్పీఎంలో యాజమాన్యం పని కల్పించడాన్ని స్థానికులు ఎన్నోసార్లు ఆందోళన చేసిన వినిపించుకునే పరిస్థితిలో యజమాన్యం లేదన్నారు. ఈఎస్ఐ హాస్పిటల్‌లో వైద్యం అందని పరిస్థితి, కంపెనీలో కార్మికులకు పండగ బోనసులు కానీ జీతభత్యాల మీద అగ్రిమెంట్లు జరపక యజమాన్యం కార్మికులను మోసం చేస్తుందన్నారు. ఇదేమని అడిగితే నాయకులతో కనీసం మాట్లాడడానికి కూడా యజమాన్యం అంగీకరించడం లేదన్నారు. రాచరిక వ్యవస్థ నిర్వహిస్తూ కార్మికులను రాచి రంపాన పెడుతుందని, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తే కార్మికులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందన్నారు.

ఎస్సీ, ఎస్సీ ఉప కులాల అభివృద్ధికి సహకరించాలి

నవతెలంగాణ-జన్నారం



ఎస్సీ, ఎస్సీ ఉప కులాల అభివృద్ధికి తోడ్పాడు అందించాలని దళిత సంఘాల జిల్లా నాయకులు, మండల సీనియర్ నాయకులు దూమల్ల రమేష్ అన్నారు. శనివారం దళిత సంఘాల ఆధ్వర్యంలో ఎస్సీ కార్పొరేషన్ నూతన రాష్ట్ర ఛైర్మన్‌గా ఎన్నికైన నగరి ప్రీతంను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఎస్సీ కులాలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి తమ సహాయ సహకారాలు అందించాలని ఆయనను కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మామిడిపల్లి ఇందయ్య, బానేష్ దుమల ప్రవీణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

కవ్వాల్ టైగర్ జోన్‌లో ఆంక్షలు ఎత్తివేయాలి

నవతెలంగాణ-జన్నారం



కవ్వాల్ అభయారణ్యంలో ఆంక్షలు ఎత్తివేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త భూమాచారి మండలంలోని రాంపూర్ గ్రామంలో ప్రచారం చేపట్టారు. శనివారం ఆయన ఆంక్షలు ఎత్తివేత కమిటీ నాయకులతో కలిసి పర్యటించారు. ప్రజలకు అటవీ ఆంక్షలతో ప్రజలకు కలుగుతున్న నష్టాల గురించి వివరించారు. దేశంలో అనేక అభయారణ్యాలు ఉన్న కేవలం కవ్వాల్ అభయారణ్యంలో మాత్రమే ఆంక్షలు ఉన్నాయని, దీంతో భారీ వాహనాలు రావడం లేదన్నారు.

వ్యవసాయ భూములే వెంచర్లు..!

- గజాల్లో విక్రయం, గుంటల్లో రిజిస్ట్రేషన్
- తక్కువ ధర పేరుతో కొనుగోలు దారులకు వల
- నోటీసులతో సరిపెడుతున్న అధికారులు

జిల్లాలో వ్యవసాయ భూముల్లో ప్లాట్ల దందా జోరుగా నడుస్తుంది. రహదారికి అనుకొని ఉన్న వ్యవసాయ భూములపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు కన్నేస్తున్నారు. వ్యవసాయ భూములను గమనించిన వ్యాపారులు వాటిపై గద్దల్ల వాలి పోతున్నారు. రైతులను మచ్చిక చేసుకొని వారి అవసరాలను ఆసరాగా చేసుకొని పంట భూములను ప్లాట్లుగా మార్చేస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్న పంచాయితీ, రెవెన్యూ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారుల కను సన్నల్లోనే ఇలాంటి అక్రమ వెంచర్లు వెలుస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోకుండా ఇష్ట రీతిలో ప్లాట్ల విక్రయాలు చేస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.



నవతెలంగాణ-మంచిర్యాల

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రియల్ వ్యాపారులు ప్లాట్ల దందా చేస్తున్నా అధికారులు ఎవరు ఆ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. గత ప్రభుత్వంలో అవలంబించిన తీరే ఇప్పుడు కూడా అధికారులు అవలంబిస్తున్నారని స్థానికంగా చర్చ కొనసాగుతుంది. అయినప్పటికీ ఉన్నత అధికారులు అక్రమంగా వెలుస్తున్న వెంచర్లపై విచారణ చేసేందుకు నిర్లక్ష్యం వహిస్తున్నరనే అనుమానం ప్రజల్లో కలుగుతోంది. ఒక వైపు సాధారణ ప్రజలు వారి భుసమస్యలు పరిష్కారం కాక అరిగోస పడుతుంటే రాజకీయ పలుకుబడి ఉన్న నాయకులు ఎలాంటి భు దందాలు చేసిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం గమనార్హం. వ్యవసాయ భూమిలో ఏ నిబంధనల ప్రకారం లేఅవుట్లు చేస్తారు, రోడ్లు, ప్రహరీ ఎలా నిర్మిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గజల్లో ధరలు నిర్ణయించి గుంటల లెక్కన క్రయ విక్రయాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిబంధనలు ఇవే

గ్రామాల్లో వెంచర్లను ఏర్పాటు చేయాలంటే నూతన పంచాయితీ రాజ్ చట్టం ప్రకారం గ్రామ పంచాయితీ పేరుపై 10 శాతం స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయాలి. కనీస సౌకర్యాలు అయిన డ్రైనేజీ, విద్యుత్, మంచినీటి సౌకర్యం, రోడ్లు, పార్కు వంటి వసతులు కల్పించి గ్రామ పంచాయితీ అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కి రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ దందా ను కొనసాగిస్తున్నారు. ఇప్పటికీ కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు గ్రామ పంచాయితీల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోకుండానే డీటీసీపీ లేఅవుట్ల పేరుతో ప్లాట్ల క్రయ విక్రయాలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా ప్లాట్ల క్రయ విక్రయాలు జరపడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఇప్పటికే జిల్లాలోని, గుడిపేట్, ముల్కల్ల, వేంపల్లి, జైపూర్, భీమరం, హాజీపూర్ మండలాల్లోలో ఇలాంటి అనుమతులు లేని అక్రమ వెంచర్‌లు ఎన్నో వెలిశాయి.

ఆదేశాలు బేఖాతరు..

మంచిర్యాల జిల్లా గుడిపేట గ్రామంలో ఇటీవల కొత్తగా వెలిసిన రెండు వెంచర్‌లు చర్చ నియాంశంగా మారాయి. గుడిపేట్ నుంచి ప్రాజెక్టుకు వెళ్ళే దారిలో 4 ఎకరాల పట్టా భూమి ఉండగా దానికి అనుసంధానంగా ఉన్న ఎకరం ప్రభుత్వ భూమిని వెంచర్‌లో కలుపుకొని నిర్వాహకులు ప్లాట్లు క్రయ విక్రయాలు కొనసాగిస్తున్నప్పటికీ అధికారులెవరూ ఆ వైపు చూడడం లేదు. మరొకటి గుడిపెట్ హై వేను ఆనుకొని ఎనిమిది ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంచర్ ఏర్పాటు చేశాడు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్‌కు గ్రామ పంచాయితీ అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ అవేవీ పట్టించుకోకుండా వెంచర్‌లో డెవలప్మెంట్ పనులు చేస్తూ, ప్లాట్లు క్రయ విక్రయాలు కొనసాగిస్తున్నాడు. గుడిపేట్ పంచాయితీ కార్యదర్శితో మాట్లాడగా నోటీసులు అందించాం అయిన పనులు చేస్తున్నారని తెలిపారు. కానీ అందించిన నోటీసులు అట్టి వ్యవసాయ భూమి సర్వే నెంబర్ చెప్పకుండా అధికారులు గోప్యంగా ఉంచడం గమనార్హం. గతం లోను ఇదే వెంచర్ నిర్వాహకుడు వేంపల్లిలో ఏర్పాటు చేసిన అనుమతి లేనీ వెంచర్‌లో అధికార పార్టీ నాయకులతో కలిసి అనుమతులు లేకుండా నే ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చేయించారనే ఆరోపణలు ఉన్నాయి.

లక్షెట్టిపేటలో సైతం ఇదే తీరు

ఇదే తరహాలో లక్షెట్టిపేట్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి వెళ్లే రూట్‌లో కొన్ని వెంచర్‌లు వెలిశాయి. 5 ఎకరాల్లో వెలిసిన వెంచర్‌కు అప్పటి అధికారులు నోటీసులు అందజేశారు. అయినప్పటికీ అక్కడి రియల్ ఎస్టేట్ వ్యాపారులు అవేవీ పట్టకుండా ప్లాట్లను ఇష్టానుసారం గా అమ్మేస్తున్నారు. మార్కెటింగ్ ఏజెంట్లను పెట్టుకొని ప్లాట్లను అమ్ముతూ ప్లాట్ నుండి వచ్చిన డబ్బులో కొంత ఏజెంట్‌లకు కమిషన్ లుగా ఇస్తూ కొనుగోలు దారులను దోచుకుంటున్నారు. గ్రామ పంచాయితీ అధికారుల నిబంధనలు బేఖాతరు చేస్తూ ఇష్ట రీతిన అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్ల క్రయ విక్రయాలు చేస్తున్న రియల్ వ్యాపారులపై ఉన్నత స్థాయి అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అక్రమ లేఅవుట్లకు నోటీసులు ఇచ్చాం

వెంకటేశ్వర్ రావు, జిల్లా పంచాయతీ అధికారి



వ్యవసాయ భూముల్లో ఇల్లీగల్‌గా ప్లాట్ల దందా కొనసాగించే వారికి ఇప్పటికే నోటీసులు అందించాం. వ్యవసాయ భూముల్లో వెంచర్ ఏర్పాటు చేయాలి అంటే ముందుగా గ్రామ పంచాయితీకి పది శాతం స్థలం కేటాయించాల్సి ఉంటుంది. వెంచర్‌లో రోడ్లు, విద్యుత్, మంచినీటి సదుపాయాలు కల్పించాలి. రూల్స్‌కు విరుద్ధంగా ఎవరైనా అక్రమ వెంచర్లు ఏర్పాటు చేస్తే వెంచర్ నిర్వాహకులుపై చర్యలు తీసుకుంటాం. గతంలో చాల వెంచర్‌లకు నోటీసులు అందించాం. అయినప్పటికీ వినక పోతే హద్దురాళ్ల తొలగిస్తాం.

జర్నలిస్ట్‌ను పరామర్శించిన జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణానికి చెందిన పాత్రికేయుడు కత్తూరి కిరణ్ కుమార్ నాన్న జైకుమార్ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న శనివారం పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జైకుమార్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. శ్రద్ధాంజలి ఘటించి, సానుభూతిని వ్యక్తం చేశారు. మాజీ మంత్రి వెంట నాయకులు ఉన్నారు.

యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

స్వయం ఉపాధి పొందాలనుకునే ఆసక్తి గల పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు రామానంద తీర్థ సంస్థ ప్రతినిధి విహారి కృష్ణ తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామానంద తీర్థ సంస్థ సౌజన్యంతో శ్రీ షిరిడీ సాయి సొసైటీ వారు 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. అకౌంటింగ్, టాలీ, కంప్యూటర్, టైలరింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఈ శిక్షణ హైదరాబాద్‌లో ఉంటుందని శిక్షణానంతరం ఉపాధి అవకాశం కచ్చితంగా కల్పిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 90148 26354 సంప్రదించాలని సూచించారు.

వైభవోపేతంగా జగన్నాథ రథయాత్ర

- జనసంద్రంగా మారిన ప్రధాన వీధులు
- ఆకట్టుకున్న భక్తుల సంప్రదాయ నృత్యాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జగన్నాథుని రథయాత్ర అత్యంత వైభవోపేతంగా, కన్నుల పండువగా సాగింది. పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులతో పురవీధులు జనసంద్రంగా మారాయి. శోభాయాత్రలో భాగంగా ఇస్కాన్ సభ్యులు సంప్రదాయ దుస్తులు ధరించి చేసిన భజన కీర్తనలు, పాడిన భక్తిపాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అటు మహిళలు, భక్తుల లయబద్ధ నృత్యాలు అలరించాయి. అంతకుముందు మథుర జిన్నింగ్ ఆవరణలో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పూలతో అందంగా అలంకరించిన వాహనంలో ఉంచి శోభాయాత్రను ప్రారంభించారు. అటు పలు దేవతల వేషాధారణలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ శోభాయాత్రలో ఇస్కాన్ ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, మహిళలు, భక్తులు భారీ సంఖ్యలో హాజరై రథాన్ని తాడుతో లాగారు. పూరిలో అత్యద్భుతంగా జరిగే ఉత్సవాన్ని మరిపించేలా ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో ఈ రథయాత్ర కొనసాగింది. పలువురు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, వ్యాపారులు భక్తులకు ప్రసాదాల వితరణ చేపట్టారు. శోభాయాత్రతో ప్రధాన వీధులన్నీ శోభాయమానంగా మారాయి. లోక కళ్యాణార్థమే ప్రతియేటా తమ సంస్థ ఆధ్వర్యంలో దేశవిదేశాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. అనంతరం మహాన్నదానం ఏర్పాటు చేశారు.

మహిళపై లైంగికదాడి

నవతెలంగాణ-ముధోల్

తానూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన నాగనాథ్(24)పై ముధోల్ పోలీస్ స్టేషన్‌లో అత్యాచారం కేసు నమోదైనట్టు ముధోల్ ఎస్సై సాయికిరణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తానూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ(40) శుక్రవారం తానూర్ మండలం నుంచి ముధోల్‌లో ఓ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చింది. దీంతో సదరు యువకుడు వివాహితకు మాయమాటలు చెప్పి ముధోల్ శివారుకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు శనివారం ముధోల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

ఉద్యమకారులకు న్యాయం చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ రాష్ట్ర సాధనకు 1969 నుండి, తొలి, మలి దశ ఉద్యమాలో పాల్గొని, లాటీ దెబ్బలు, అరెస్టులు, జైలు శిక్షలు అనుభవించి, 1969లో ఒక సంవత్సరం విద్యను కోల్పోయి, ఉద్యోగాలు రాక అనేక ఇబ్బందులకు గురైన ఉద్యమకారులకు ఇంత వరకు న్యాయం జరుగలేదనితెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్త సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం వెంటనే స్పందించి పింఛన్లు, ఉచిత వైద్య సౌకర్యాలతో పాటు 250 గజాల స్థలం, వారి పిల్లలకు రిజర్వేషన్లు కల్పించి ఆదుకోవాలని ఈమేరకు రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేయనున్నట్టు తెలిపారు.

మండల అభివృద్ధిలో మాజీ జడ్పీటీసీ పాత్ర కీలకం



నవతెలంగాణ-జన్నారం

మండల అభివృద్ధిలో మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ కీలకపాత్ర పోషించారని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా నాయకులు కడారుల నరసయ్య అన్నారు. ఎర్ర చంద్రశేఖర్ పదవి కాలం పూర్తయిన సందర్భంగా శనివారం ఆ సంఘం నాయకులతో శాలువాతో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోలుకుంటున్న విద్యార్థులు

నవతెలంగాణ-నార్నూర్

శ్వాసకోశ సమస్యతో ఏకలవ్య, ఆదర్శ, ఆశ్రమ పాఠశాలలకు చెందిన 20మంది విద్యార్థులు శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురికాగా వారిలో 18మంది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని హెచ్ఎంఓ నాందేవ్ తెలిపారు. ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించినట్టు పేర్కొన్నారు. గతంలో కూడ శ్వాసకోశ సమస్యతో అస్వస్థతకు గురైనట్టు తెలిపారు.

బదిలీల ప్రక్రియకు ప్రభుత్వానికి ధన్యవాదాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



గత 10 సంవత్సరాలుగా నిలిచిపోయిన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ప్రభుత్వం చేపట్టినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్టు పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. శనివారం జిల్లాలో పర్యటించిన ఆయన పట్టణంలోని బీసీ సంఘ భవనంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ముందుగా బీసీ సంఘం నాయకులు ఆయనకు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. రాష్టంలోని దాదాపు 20 వేలకు పైగా ఉపాధ్యాయులకు పదోన్నతి, బదిలీలు కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. ఇన్ని సంవత్సరాలు పదోన్నతులు బదిలీలు లేక ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. ఎలాంటి తప్పులకు తావు లేకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పారదర్శకంగా ఈ ప్రక్రియ నిర్వహించిందన్నారు. విద్యాశాఖలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ఆడే నూర్‌సింగ్, నర్ర నవీన్ యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ ప్రకాష్, మోహన్ సింగ్, రాజు, బాబన్న, ముజీబ్, సంతోష్, సునీల్, దినేష్ ఉన్నారు.

వైద్య శిబిరాల పేరుతో వేధించడం మానుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి యాజమాన్యం వైద్య శిబిరాల పేరుతో కాంట్రాక్టు కార్మికులను వేదించడం మానుకోవాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఎస్సీసీడబ్ల్యూయూ-ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం అన్నారు. నస్పూర్ సివిల్ కార్యాలయంలో(ఎస్‌సీసీడబ్ల్యూయూ-ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలకు ఉచిత వైద్యం కల్పించలేని సింగరేణి యాజమాన్యం మెడికల్ క్యాంపులలో బీపీ, షుగరు, ఈసీజీ టెస్టుల పేరుతో కార్మికులను ఆందోళనకు గురి చేస్తున్నరని మండిపడ్డారు. సింగరేణిలోని వివిధ విభాగంలో పనులు చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ప్రధానంగా డస్ట్ వల్ల వచ్చే జబ్బులకు ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి కానీ మైనింగ్ ఏరియాలో అదేవిధంగా అధికారుల, పర్మినెంట్ కార్మికుల నివాస ప్రాంతలలో, ఆఫీస్ ఏరియాలో పనిచేస్తున్నటువంటి కాంట్రాక్టు కార్మికులకు ప్రధానంగా దుమ్ము, దూళి వల్ల ఆరోగ్యపరమైన సమస్యలు వస్తుంటాయన్నారు. కానీ ఈ కార్మికులకు సింగరేణిలో ఎక్కడ కూడా ఉచిత వైద్యం ఇన్ పేషెంట్‌గా కల్పించడం లేదని, అలాంటి పరిస్థితుల్లో నేడు సింగరేణి యాజమాన్యం ఆరోగ్యవంతమైన కార్మికులు కావాలని ఉద్దేశంతో డిస్పెన్సరీ, మైనింగ్ ఏరియాలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. బీపీ, షుగర్, ఈసీజీలో, చిన్న చిన్న తేడాలొచ్చిన కాంట్రాక్టు కార్మికులను డ్యూటీలోకి తీసుకోకుండా డాక్టర్లు నాట్ ఫర్ అలో డ్యూటీ అని రాస్తున్నారన్నారు. దీనివల్ల ప్రధానంగా ఈసీజీ కాకుండా టుడీ ఎకో చేయించుకోవాలంటే బెల్లంపల్లి రీజియన్‌లో సింగరేణి నిర్వహిస్తున్న ఏ హాస్పిటల్లో టుడీ ఎకో ఆపరేటర్ డాక్టర్లు గాని లేరన్నారు. నిర్లక్షణంగా కాంట్రాక్ట్ కార్మికులు మంచిర్యాల పరిసర ప్రాంతంలోని ప్రయివేట్ ఆస్పత్రికికి వెళ్లి రూ. వేల ఖర్చు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఆలోపు ఒక్కో కాంట్రాక్ట్ కార్మికుడు సింగరేణి ఏరియా హాస్పిటల్ చుట్టూ, మంచిర్యాల ప్రయివేట్ హాస్పిటల్‌లో చుట్టూ తిరిగి మస్టర్లు కోల్పోవాల్సి వస్తుందన్నారు. దీనివల్ల కార్మికులు ఆందోళన గురి అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బి రాజేందర్, ఎం శంకర్, తిరుపతి, గోపాల్, అప్పారావు, రాజు, జంపయ్య, సంపత్, నాగరాజు, కొమురయ్య, నరసమ్మ, కమలమ్మ, పుష్ప, శారద, నాగమణి, తిరుమల, గౌరీ, లక్ష్మి, రాజమ్మ, లలిత పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా



నవతెలంగాణ-నస్పూర్

బొగ్గు గనులను వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం జీఎం కార్యాలయం ఎదుట సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో వెలువడిన బొగ్గు నిక్షేపాలను కేంద్ర ప్రభుత్వం వేలం వేయడాన్ని గుర్తింపు కార్మిక సంఘంగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని బొగ్గు నిక్షేపాలను నామినేషన్ పద్ధతిలో ప్రభుత్వం సింగరేణి సంస్థకే కేటాయించాలన్నారు. గుజరాత్, ఝార్ఖండ్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాలలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు అక్కడ ఉన్నటువంటి ప్రభుత్వ రంగ సంస్థలకు ఏ విధంగా నామినేషన్ పద్ధతిలో ఇచ్చారో అదేవిధంగా ఇక్కడ కూడా బొగ్గు నిక్షేపాలను వేలంపాట లేకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్రం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విదానలను ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని కోరారు. సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసే కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సింగరేణిని ప్రయివేటు పరం చేస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు కోల్పోవడంతోపాటు ప్రభుత్వ ఆధాయానికి గండి పడే అవకాశాలు ఉన్నాయన్నారు. లేని పక్షంలో గుర్తింపు కార్మిక సంఘం ఆధ్వర్యంలో బొగ్గు నిక్షేపాలు సింగరేణి సంస్థకు కేటాయించేంతవరకు ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. అనంతరం జనరల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా, ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్ రావు, బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, బ్రాంచ్ నాయకులు రాచర్ల చంద్రమోహన్, సంపత్, నాగభూషణం, ప్రసాద్‌రెడ్డి, అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

